కథా నిలయం
1463
శ్రీకాకుళం

# వ్యర్థానందం

మెలుకువ వచ్చి కళ్లు తెరిచి పరిసరాలు పరికించి చూచాడు.

వాతావరణం అంతా మామూలుగానే ఉంది. సరోజ పడుకుని ఉండాల్సిన మంచం, పక్క ఖాళీగా ఉండడమే కాక తీర్చిదిద్దినట్లుగా ఉన్నాయి. అంటే ఆమె అప్పుడే లేచి తన పని పాటల్లో కూరుకుపోయిందన్న మాట!

బల్లమీది గడియారం వంక చూశాడు. టైం ఏడు గంటలు అవటానికి ఇంకా అయిదారు నిమిషాల విరామం ఉంది.

మామూలుగా అయితే ఈ సరికి తాను కూడా నిద్రలేచి ఉరుకులు పరుగులుగా తయారవుతూ ఉండేవాడు.

ఒక్కక్షణం ఒళ్లు దులపరించుకుని మంచం మీదనుంచి కిందకు దూకేసి రోజులో కలిసి పోదాం అనుకున్నాడు. కాని బద్ధకం ఆ పని చేయనిచ్చింది కాదు. ఆత్రంగా అటు ఇటు చూశాడు. అంతటా నిశ్శబ్దం ఆవరించుకుని ఉంది. ఎక్కడా చడీ చప్పుడు లేదు. సరోజ ఏం చేస్తున్నట్లు ?

మంచం దిగి లోపలికి వెళ్లి పరిశీలించాలని అనిపించింది. ఉత్తర క్షణమే మనస్సు మళ్ళీ మోరాయించింది. ఎందుకు ఇప్పుడే లేవడం ? అసలు లేవకపోతే మటుకేం ? ఏమయిపోతుందిట ? ఆ తమాషా కూడా చూద్దాం ... నిద్ర మంచం మీద నుంచి కిందికి దిగకపోతే ఏమవుతుందో - అనిపించింది మనస్సుకు.

ఉదయమే సాధ్యమయినంత పెందలకడనే లేవాలి, కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఇంటి పనుల్లో ఏమయినా సహాయం చేయగలిగితే చేయాలి, గబగబ తయారయి ఆఫీసుకు చేరుకోవాలి.

ఆఫీసుకు చేరుకునేంత వరకే తను మనిషి.

అక్కడికి చేరుకున్నాక ? - యంత్రం అయిపోతాడు. తన ప్రసక్తి అంతగా

లేకుండానే ఎన్నెన్నో పనులు చేస్తాడు. మనసుకు కొన్ని అతుక్కుంటాయి; కొన్ని అతుక్కోవు. ఇష్టం ఉంటాయి, ఉండవు. అయినా ఏదో బయటి శక్తి తనని పురమాయిస్తున్నట్లు చకచక పనులు చేసుకుంటూ పోతూ ఉండడమే అలవాటు అయిపోయింది. కాగితాలు వస్తూ ఉంటాయి, వాటిని చూచి, చూచినట్లుగా ఒక దస్కతు వేసి బయటకు పంపేస్తూ ఉండాలి. కొన్ని కాగితాలకు జవాబులు వ్రాయాలి. వ్రాయాలంటే, స్వంతంగా కాగితం కలం దగ్గరకు తీసుకుని తీరి కూర్చుని వ్రాయ గూడదు. సమయం వృథా అయిపోతుంది అలా చేస్తే. వృథా కాకుండా తాను చెప్పినవన్నీ వ్రాసుకుంటూ పోవటానికి ఒక సెక్రటరీ ఉన్నది. ఆమెను పిలవడం తోటే వచ్చి కూర్చుంటుంది. తను 'బడబడ' చెబుతూ ఉంటే చకచక వ్రాసుకుంటూ పోతుంది. ఎంతసేపయినా అలా వ్రాసేస్తూ ఉంటుంది. చెప్పుకుంటూ పోవడమే తాను చేయవలసిన పని. 'అయిపోయింది ఇక వెళ్లు' - అంటే గాని ఆ అమ్మాయి గదిలోంచి బయటకు వెళ్లదు. అలా వెళ్లిపోవడంతో ఆ అమ్మాయి 'రాత' అయిపోయిందని అనుకోవటానికి వీలులేదు. అరగంట గడిచీ గడవక ముందే తాను రాసుకు పోయిన ఉత్తరాలు, నోట్సులు అన్నీ చక్కగా తప్పులు లేకుండా 'టైప్' చేసి తీసుకువస్తుంది. తాను యెక్కడ సంతకం చేయాలో అక్కడ కావల్సినంత జాగా ఖాళీగా 'ఇన్వైటింగ్'గా కనిపిస్తూ ఉంటుంది. ఎంత వెదికి చూచినా తప్పు దొరకదు ఆ అమ్మాయి తీసుకు వచ్చే కాగితాలలో. అయినా తప్పులు వెదకడం కూడా అతనికి అంతగా ఇష్టం లేదు.

'తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు' అని ఒక పద్యం అతనికి బాగా గుర్తు. ఎంతో ఇష్టం కూడా. ఇతరులను వేలు పెట్టి చూపడం అతనికి సుతరామూ ఇష్టం కాదు. ఎప్పుడో చదివాడు ఏదో పుస్తకంలో - ఇంగ్లీషులో - నీవు ఇతరులవైపు ఒక వేలు చూపితే, నీ వైపే మూడువేళ్లు వాటంతట అవే చూస్తూ ఉంటాయి అని. అంటే, ఇతరులు ఒక తప్పు చేశారనుకుంటే నీవు మూడు తప్పులు ఇదివరకే చేసి కూర్చున్నా వన్నమాట ! నీ కంట్లో దూలం చూచుకోకుండా ఇతరుల కళ్ళల్లో నలుసు ఎంచటానికి ప్రయత్నిస్తావేం .... ! అని ఇంకో ఆసామి దబాయించి మరీ అడిగాడు ఇంకో పుస్తకంలో. నోరు మూసుకు కూర్చుంటేనే ఎంతో మంచిది ! ఊరుకున్న కొద్దీ తప్పు

ఒప్పుల గురించి ఆలోచన ఎక్కువయిపోతుంది. 'అసలు జీవితమే ఓ పెద్ద తప్పు !-' అని తీర్మానం చెప్పేశాడు ఇదివరలోనే ఒక స్నేహితుడు. తప్పు లేదు, ఒప్పు లేదు ... అంతా నీ మనసు తయారు చేయడంలో ఉంది.

మెలకువ రాగానే నిద్ర మంచం మీద నుంచి దిగకుండా ఉండడం తప్పు అని తనకు తెలుసును. పనులు చేయడంలో జాప్యం జరగకూడదు అనే సంగతి కూడా బాగా తెలుసును. అయినా ఎందుకో ఈ రోజు మనస్సు మరీ మొండికి వేస్తోంది.

లేవకపోతే ఏం అవుతుంది ?

యంత్రం లాగా పనులు చేసుకుంటూ పోకపోతేనేం - ఒక పని, అందుకు కారణం, తరువాత ఫలితం --- ఈ మూడూ కలిపి కట్టుగా తిరుగుతూ ఉంటాయి. ఒక వలయం లాగా తయారయి ఎప్పటికప్పుడు మనిషిని పనులలో కూరుకు పోయేట్లు చేస్తాయి. సాలెగూడు నిర్మించిన పురుగు అందులోనే చిక్కుకు పోయినట్లుగా మనిషిని ఈ వలయంలో విలయ తాండవం చేసేట్లు చేస్తాయి.

అతను వెల్లకిల పడుకుని, దుప్పటి ముసుగు తీసి వేయకుండానే ఈ ఆలోచనలు చేస్తూ ఉన్నాడు. మంచం మీంచి దిగితే ఆలోచనల ప్రవాహం ఆగిపోతుంది. తరుముకు వచ్చే పనులు దానికి అడ్డు కట్ట వేస్తాయి. అవి ఆగిపోవడం అతనికి ఇప్పుడు ఇష్టం లేదు.

గదిలోకి ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు విని కళ్లు గుమ్మం వైపు తిప్పాడు.

సరోజ వస్తోంది. తనవైపే ఆతురతగా చూస్తోంది. 'ఏమండీ. ఇంకా లేవలేదేం? ఆఫీసుకు టైం అయిపోవడం లేదూ?' అంది దగ్గరకు వచ్చి. అతను ప్రయత్నపూర్వకంగా కళ్లు మూసుకున్నాడు. సరోజ అతని భుజాలు పట్టుకు కుదిపింది. ఈమారు కళ్లు తెరిచి సూటిగా ఆమె కళ్ళల్లోకి చూచాడు.

'ఏమిటి అట్లా ఎంతగా చూస్తారు?' అంది సరోజ కొద్దిగా ఆశ్చర్యపోతూ.

అతనేమీ మాట్లాడలేదు.

ఆమె అతన్ని మళ్లీ కుదిపింది. 'లేవండి, ఏమిటి ఇంత బద్ధకం, ఈ వేళ?' - అంటూ మళ్లీ లేపే ప్రయత్నం చేయకుండానే, ఏదో గుర్తు వచ్చిన మనిషి లాగ ముఖం పక్కకు తిప్పుకుని లోపలకు వెళ్లిపోయింది.

'అమ్మయ్య' అనుకున్నాడు అతను.

లేవవలసిన అవసరం తక్షణమే లేకుండా, తప్పించుకున్నందుకు ఆనందంగా ఉంది.

ఎందుకు లేవాలి ? నేను హాయిగా నిద్ర పోతాను; నిద్ర మంచాన్నే కౌగలించుకు పడుకుంటాను - లేవను - కాళ్లు నేలమీద మోపను. పనుల వెనకాల పరుగులు తీయను - ఏమవుతుందో చూస్తాను అనుకున్నాడు ఒకటికి నాలుగుసార్లు మనసులోనే. ఒక ఆలోచనను పదే పదే అనుకున్నందువల్ల అది దృఢపడుతుంది. స్వంతం అయిపోతుంది. ఆ ఆలోచన తప్ప ఇతరమైన జీవితం ఏమీ లేకుండా పోతుంది.

సరోజ మళ్లీ వచ్చింది.

'ఏమిటి ఇంకా లేవనే లేదా ? ఏమిటి మీ ఉద్దేశ్యం?' అంది కొద్దిగా కోపం స్వరంలో రంగరించి.

అతను ఏమీ మాట్లాడలేదు.

కళ్లు తెరిచీ తెరవకుండా అనాసక్తంగా పడుకుని ఉండిపోయాడు.

'ఏమండీ ! ఏమిటి ఈ వాలకం ? ఎందుకు లేవడం లేదు. ఒంట్లో బాగానే ఉంది గదా !' అంటూ ఆమె అతని నుదురు, చేయి, ఎదుర్రొమ్ము తాకి చూచింది. ఏమీ 'ఎబ్నార్మాలిటీ' కనిపించనట్లుగా ముఖంలో ఆనందం విస్తరింప చేసుకుని 'లేవండీ. అవతల ఆఫీసుకు టైంఅయిపోతుంది' అంది మురిపెంగా.

అయినా అతనికి లేవబుద్ధి కాలేదు. ఎందుకు లేవాలి ?

'ఆఫీసుకు వెళ్లరా ? టైమయిపోతుంది. ముందు లేచి కాఫీ తాగండి - చూద్దాం' - అంది సరోజ.

కాఫీ మాట చెవిని పడడంతోటే అతనిలో కొత్త స్పందన బయలు దేరింది.

ఒక్కక్షణం - లేచి కాఫీ తాగి మళ్లీ పడుకుందామా అనుకున్నాడు. ప్రలోభంలో పడడం మంచిది కాదని మనస్సు మళ్లీ హెచ్చరించింది.

'కాఫీ తాగరా?' అంది సరోజ మళ్లీ, అతని బలహీనతను కాష్ చేస్తున్నట్లుగా.

'తీసుకురా' - అన్నాడు నోరు విప్పి, అతి నిదానంగా - బలహీనంగా - మాట్లాడడానికి కూడా శక్తిలేని వాడిలాగ నటించటానికి ప్రయత్నిస్తూ.

'ఊహు, ముఖం కడుక్కోకుండా ఎప్పుడేనా కాఫీ తాగారా మీరు? లేవండి ముందు, ముఖం కడుక్కోండి. కాఫీ ఇస్తాను. ఫ్లాస్క్‌లో పోసి ఉంచాను - ఇందాకటి నుంచి చూస్తున్నాను ---' అంటూ సరోజ యేదో మాటలు కల్పించుకుంటూ పోతోంది.

'ఒక్కరోజుకు ఫరవాలేదు, తీసుకురా, ముందు కాఫీ తాగుతాను. తర్వాత చూచుకుందాం-' అన్నాడు నీరసంగానే; గొంతులో దైన్యం అంతా రంగ రించుకుంటూ.

సరోజ అతని ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూచింది ముందు; తరువాత ఆశ్చర్యార్థకంగా చూచింది; ఆ తరువాత కారుణ్యం వలకపోస్తూ చూచింది.

'సరే, ఇస్తాను. కాఫీ తాగిన తరువాత వెంటనే మంచం దిగి ఆఫీసుకు తయారు కావాలి సుమా! -' అని హెచ్చరిస్తూ లోపలకు వెళ్లింది.

విజయోత్సాహం అతనికి మరింత ధైర్యం ఇచ్చింది. మంచం దిగకూడదు గాక దిగకూడదు - అనుకున్నాడు.

వేడి వేడి కాఫీ గొంతులోకి వెడుతున్న కొద్దీ అతని నిశ్చయం మరింత బలపడ సాగింది.

ఖాళీ కాఫీ కప్పు సరోజకు అందిస్తూ ధైర్యంగా 'లేవను నేను; మంచం దిగను ఇవాళ!' అన్నాడు.

ఆమె అతని వంక మళ్లీ ఆశ్చర్యంగా చూచింది.

'ఆఫీసుకు వెళ్లకపోతే సముద్రం పొంగిపోయి, నగరాన్నంతా ముంచి వేస్తుందనీ, ఆకాశం విరిగి మీద పడుతుందనీ రోజూ నాకు ఉపదేశాలు ఇచ్చే మీరేనా ఈ మాటలు మాట్లాడుతున్నది?' అంది.

అతని ముఖం గంభీరంగా తయారయింది. నవ్వుదామనుకున్న ప్రయత్నం విరమించుకున్నాడు.

'సరే, మీ ఇష్టం' నేను మాత్రం ఆఫీసుకు వెళ్లిపోతున్నాను. సాయంత్రం అయిదింటికే వస్తాను. డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు మీరు తినండి – మీ ఇష్టం. పిల్లలు బడికి వెళ్లిపోయారు' అంది సరోజ.

ఈ పదేళ్ళలో అతను మొండితనం చేస్తున్న సందర్భం ఇదే మొదటిది – అని స్ఫురణకు తెచ్చుకుంది. ఏమిటో అతని ఉద్దేశ్యం ? సాయంత్రానికి అన్నీ తెలిసి వస్తాయి, తొందర పడడం దేనికి అని తనకు తాను చెప్పుకుంది.

సరోజ ఆఫీసుకు వెళ్లిపోయిన తర్వాత, అతనికి మరింత ధైర్యం వచ్చినట్లు అయింది.

సాయంత్రం దాకా నన్ను అడిగేవాళ్లు లేరు. నా ఇష్టం. మంచాన్ని వదలను. హాయిగా విశ్రాంతిగా రికామీగా పడుకుంటాను. ప్రపంచాన్ని గురించి ఎంత తీవ్రంగా ఆలోచించగలనో, పరీక్షించుకుంటాను -- అనుకున్నాడు.

అతను ఇంకేమీ చేయలేదు.

సాయంత్రం సరోజ ఆఫీసు నుంచి వచ్చి అలాగే అక్కడ పడిపోతూ నుంచుండిపోయింది.

'అన్నం కూడా తినలేదా?' ఆకలి అనిపించలేదా ? ఎందుకిట్లా చేస్తున్నారు? ఏమిటి మీ ఉద్దేశ్యం ?---' ఇలా అనేక రకాల ప్రశ్నలు వేసింది.

అతను దేనికీ సమాధానం చెప్పడు.

బేలగా, నీరసంగా చూస్తాడు ముఖంలోకి.

తప్పనిసరి అనిపించినప్పుడు 'ఉ' - 'అ' అని మాత్రం అంటాడు.

సాయంత్రం, రాత్రయింది.

చీకటి ప్రపంచాన్నంతా ఆవరించింది.

అతనిలో మాత్రం అణుమాత్రమైనా కదలిక లేదు, మంచం మీద దుప్పటి ముసుగులో అలాగే పడుకుని ఉండిపోయాడు.

పిల్లలు దగ్గరకు వచ్చి పలుకరించటానికి ప్రయత్నం చేశారు. అతను ఏమీ ఉత్సాహం చూపించలేదు. వాళ్లను దగ్గరకు తీయలేదు. చదువుల సంగతి ప్రశ్నలు వేయలేదు. హిత వచనాలు ఏమీ చెప్పలేదు.

అలవాటు అయిన ధోరణి నుంచి దూరంగా ఉండడం ఎలా ? -- రోజూ చేస్తున్న యాంత్రికమైన పనులు చేయకుండా స్వేచ్ఛగా, సర్వస్వతంత్రంగా ఉండడం ఎలా - అని సర్వవిధాల ప్రయత్నిస్తున్న మునిలాగ మిన్నకుండి పోతున్నాడు.

మరునాడు డాక్టర్ను పిలిపించింది సరోజ.

అతను డాక్టర్‌తోనూ ఎక్కువగా సహకరించలేదు.

'మంచం మీద నుంచి లేవరేం?' అంటే -

'ఎందుకు లేవాలి? లేవకపోతే ఏమవుతుందో పరీక్ష పెట్టుకు చూచే స్వాతంత్ర్యం కూడా లేదా నాకు?' అని ఎదురు ప్రశ్నలు వేయసాగాడు. ఈ ప్రశ్నలు - అతని దగ్గర్నుంచి సమాధానంగా - లాగటానికి దాదాపు రెండు గంటల సేపు ప్రయత్నం చేయవలసి వచ్చింది.

సరోజకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడినట్లు అయింది. డాక్టర్లు భరోసా ఇచ్చారు. మరేం భయం లేదన్నారు. 'అతని మనసుకు నచ్చినట్లు చేయనిద్దాం కొన్నాళ్లు. అతనికే

విసుగువచ్చి మామూలు మనిషి అయిపోతాడు. ఇందుకోసం ప్రత్యేకించి చికిత్సలు చేయవలసిన అవసరం ఏమీ లేదు-' అన్నారు. అతని శరీరానికేం ఇబ్బంది లేదన్నారు.

అతని పక్క మార్చటానికీ, దుప్పట్లు సరిచేయటానికీ; తను ఆఫీసుకు వెళ్లిన సమయంలో అతని అవసరాలు కనిపెట్టటానికీ ఒక నర్సును ఏర్పాటు చేసింది సరోజ. మొదట్లో పిల్లలు అతన్ని రోజూ ఒకమారు ఉదయం పూట చూస్తూ ఉండేవాళ్లు. వారం రోజులు అయిపోయిం తర్వాత వాళ్లకూ ఆ అలవాటు తప్పిపోయింది.

అతను పడుకునే ఉంటున్నాడు.

నాలుగురోజులు అయిన తర్వాత వీపు మీద పుండ్లు బయలుదేరాయి. 'బెడ్ సోర్స్' అనుకున్నాడు. నర్స్ వాటికి ఆయింట్ మెంట్ పూస్తోంది. అవి రాకుండా మంచం కింద ఏవేవో ధూపాలు వేస్తోంది.

సరోజ అతన్ని లేవమనడం లేదు. ఎందుకు మంచం దిగకుండా దాని మీదనే శవాకారంగా పడుకుండి పోతున్నారు అని ప్రశ్నలు వేసి విసిగించడం లేదు .

ఆఫీసు వాళ్లు అతన్ని చూడటానికి వచ్చారు మూడో రోజునో, నాలుగో రోజునో. ఆఫీసుకు ఎప్పుడు వస్తారు ? ఏమిటి సుస్తీ? ఎలా వచ్చింది ? డాక్టర్లు ఏమంటున్నారు? మేం ఏం చేయగలం ? ముఖమాటం లేకుండా మా వల్ల కావలసిన దేమిటో చెప్పండి- అని రకరకాలుగా అనేక స్వరాలలో అడిగారు.

అన్నిటికీ ఒకటే సమాధానం అతని దగ్గర నుంచి. చిరునవ్వు. చిరుమందహాసం. ప్రపంచాన్నంతా ధిక్కరించి జయించి లోబరుచుకున్నాననే అతిశయంతో కూడిన ఆనందం ముఖం మీద ప్రస్ఫుటం అవుతోంది.

అతని ప్రపంచం వేరు, అతని ఆలోచనలు వేరు; దేనిని గురించి ఎంత సేపు ఆలోచిస్తున్నాడో అతనికే గమనం లేదు. అతని ప్రపంచంలో ఇంకెవరూ ప్రవేశించరు. బయటి గుమ్మం దగ్గరే ఉండిపోతారు సరోజ; నర్స్ కూడా.

ఏకాంతంలో ఉన్న ఆనందం, అస్థిత్వాన్ని స్పష్టంగా తెలియజెప్పే అతిశయం

తప్ప ఇంకేమీ అతన్ని ఆశ్రయించడం లేదు. ఈ ఆశ్రయం మనస్సుకు ఊరటగానే ఉంది. ఎలాంటి ఇబ్బందులూ తీసుకు రావటం లేదు.

ఆ రోజు - మధ్యాహ్నం నాలుగు గంటలు అయ్యింది. గోడ మీద గడియారంలో ముళ్లు చూపుతున్న టైం అది. అయినా తనకు టైంతో నిమిత్తం ఏముంది ? కాలానికీ స్థలానికీ అతీతంగా ఉన్న సీమలో తిరుగుతున్న స్పృహ తప్ప ఇంకేమీ గుర్తు రావటం లేదు.

ఎవరో వచ్చి ఎదురుగా కూర్చున్నారు.

'ఎలా ఉన్నారు?' అని అడిగారు.

'నాకేం? బాగానే ఉన్నాను-' అని అతను సమాధానం చెప్పాడు.

'ఎన్నాళ్లు ఇట్లా ఉందామని మీ అభిప్రాయం?' అని అడిగారు - మళ్లీ అతడు, ఆ కొత్తగా వచ్చినవాడు.

'ఆ ఆలోచనేం లేదు. ఎప్పుడూ ఇట్లాగే ఉంటాను. ఇదే మనిషికి సహజస్థితి అని నాకు నమ్మకం ఏర్పడుతోంది' అన్నాడు అతను.

'అలాగా ! అయితే సృష్టిపరిణామం అంతా ఆగిపోదా అందరూ ఇలాగే ఉంటే? పరిణమించకపోతే సృష్టికి ప్రయోజనం ఏముంది ? జడంగా ఉండడం కాదు - ఆ జడత్వంలో చేతనం వర్షించాలి గదా !' అన్నాడు.

అతను వెంటనే ఏం సమాధానం చెప్పలేదు.

ఏం చెప్పాలో తోచలేదు.

'నాకు సమాధానం అక్కర్లేదు. నీ మటుకు నీవే ఆలోచించుకో. ఆలోచించుకుని నీకు ఉచితం అన్నట్లుగానే చేయి. ఇందులో నేను బలవంతం చేస్తున్నదేమీ లేదు - అన్నాడు ఆ కొత్త మనిషి. అన్నాడో, అన్నట్లు అతనికి అనిపించిందో - ఈ విషయం కూడా అతనికి స్పష్టం కాదు.

కళ్లు మూసుకున్నాడు చాలాసేపు.

తెరిచి చూచిం తర్వాత -- ఎదురుగా ఆ మనిషి లేడు; కనిపించడం లేదు. ఇంతకు ముందు ఎదురుగా కుర్చీలో కూర్చుని తనను ఏవో ప్రశ్నలు వేసిన మనిషి, ప్రశ్నలకు సమాధానలు చెప్పనవసరం లేదని ఊరడించిన మనిషి ఇప్పుడు చూస్తే అసలు కనిపించడం లేదు.

ఏమయ్యాడు?

అసలు అలాంటి మనిషి నిజంగా వచ్చి కూచున్నాడా ? తనముందు. లేక అలా ఎవరో కూర్చున్నారని తనకే నిర్నిమిత్తంగా అనిపించిందా ?

జడత్వంలో చేతనం వర్షించాలని కదూ ఆ మనిషి చెప్పింది !

ఏమిటి జడత్వం ?

చేతనం అంటే ఏమిటి ?

వీటిని గురించి ఆలోచించుకోవటానికి ఇంకా సమయ విరామం కావాలి. ఇంకా లోతులకు, లోపలకు పోవాలి.

మంచం మీద నుంచి లేవవద్దు - అని తీవ్ర సంకల్పం చేసుకున్నప్పుడు గూడా ఈ నిద్రలోంచి మేలుకోమని; బయటపడమని ఎందుకు ఎవరో సూచనలు ఇస్తున్నారు, హెచ్చరికలు చేస్తున్నారు ?

నిద్రపోవడం - కనీసం పడుకుని ఉండిపోవడం - అలవాటు అయిపోయింది. అలవాటుకు దాసోహం చేయకుండా సర్వస్వంతంత్రంగా ఉండాలని కదూ ఆలోచన చేస్తున్నది ఇన్నాళ్లూ ?

ఈసారి సరోజ వచ్చి లేవమని చెప్పినప్పుడు వేరే ఏ ఆలోచన లేకుండా మంచం మీదనే లేచి కూర్చోవాలి; కిందకు ఎగిరి గంతు వేయాలి. సరోజను ఆశ్చర్యంలో ముంచెత్తాలి. అప్పుడెందుకు లేవలేదు, ఇప్పుడెందుకు అతి చురుకుగా ప్రవర్తిస్తున్నారు - అని సరోజ అర్థంకాక తికమక పడిపోవాలి !

అందరికీ కావలసిన ఆహారం, నిద్ర, షికారు - మొదటి రెండూ ఈ భూమికి సంబంధించినవే అయినా షికారు మాత్రం తాను మరేదో సీమల్లో చేసి వస్తున్నాడు. భూమి మీదనే షికారు చేయకుండా నేల విడచి సాము చేస్తున్నాడు. ఆ మాటకు వస్తే నిద్ర కూడా భూమికి సంబంధించింది కాదు గదా అనిపిస్తుంది. ఇంకా ఆలోచిస్తే ఆహారం మటుకు ? ఇట్లా ఎంత సేపయినా చివరి మెట్టు అందకుండా షికారు చేయవచ్చు. మొదటి మెట్టే చివరి దాకా తీసుకు పోవచ్చు.

ఎవరయినా పిలిస్తే బాగుండును.

తనను లేవమని అడిగితే బాగుండును.

ఇన్నాళ్లూ రికామీగా పడుకుని ఇప్పుడు ఎవ్వరూ అడగకుండానే తనంత తాను లేచి కూర్చుని నడవడం ప్రారంభిస్తే అందరూ ఏమనుకుంటారు ?

ఇన్నాళ్లూ లేవకుండా పడుకుంటే వాళ్లు ఏమనుకున్నారో తెలియదు. అది తెలుసుకోవడం కోసమయినా తాను లేవడం, దిగడం అవసరం అనిపించింది అతనికి.

ఎవరయినా పిలిస్తే బాగుండును.

పిలవమని చెప్పటానికయినా తాను మరెవరినో పిలవాలి !

సరోజా - సరోజా - అని పిలిచాడు.

బదులు లేదు.

నాలుగయిదు మార్లు పిలిచాక 'నర్స్ - నర్స్' అని మూడు మార్లు పిలిచాడు.

అతడు పిలుస్తాడనీ, పిలవడం అతనికి చేతనవుతుందనీ తెలియక వాళ్లు - అతని పిలుపు అందనంత దూరం వెళ్లిపోయారు.